# ఇంజనీరింగ్ కాలేజీ టు స్వయం ప్రతిపత్తి వర్సిటీ

## అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతున్న కెఐఐటీ - ఇదీ డా. సమంత దూరదృష్టి





సంస్థాపకుడు డాక్టర్ సమంత

**ఓ సాధారణ ఇంజనీరింగ్ కళాశాల నేడు ప్రపంచం మొత్తం అబ్బురపడేలా డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగింది. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో గత కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండ్రస్టియల్ టెక్నాలజీ (కెఐఐటి) సాధించిన ఈ అద్భుత విజయాల వెనుక దీని సంస్థాపకుడు డా. అచ్యుతానంద సమంత దూరదృష్టి ఎంతో ఉంది. ఆయన అపార శ్రమ దాగి ఉంది. గిరిజనుల జీవితాల్లో విద్యావెలుగు నింపాలన్న ఆయన అకుంఠిత దీక్ష ఈ విజయానికి కారణమైంది.**

1992లో 12 మంది విద్యార్థులు, కేవలం ఇద్దరు ఫ్యాకల్టీతో పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు ప్రారంభమైన ఈ సంస్థ అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చింది. 1997లో తొలిసారి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను సాంకేతిక విభాగంలో ప్రారంభించారు. అనంతరం ఇది ఇంజనీరింగ్ కళాశాలగా రూపాంతరం చెందింది. 2004లో యూనివర్శిటీ హోదాను సాధించింది. 2006లో దేశంలోని నూరవ సెల్ఫ్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూట్ జాబితాలో చేరింది. 2007లో 37వ ర్యాంకుకు ఎగబాకింది. 2008లో 6వ ర్యాంకును కైవశం చేసుకుంది. 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 17 వైఫై క్యాంపస్‌లతో 22 అనుబంధ విద్యాసంస్థలతో 50కుపైగా కోర్సులను యూనివర్శిటీ ఆఫర్ చేస్తోంది. విద్యా ప్రమాణాలకు కొలబద్దనిచ్చే యుజిసి వారి నాక్ గుర్తింపు, ఎఐసిటిఇ వారి ఎన్‌బిఎ గుర్తింపు ఈ యూనివర్శిటీ కిరీటంలో కలికితురాయిలుగా ఉన్నాయి.

### ఎన్నెన్నో కోర్సులు..

అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో ఉన్న ఈ యూనివర్శిటీలో ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్, పీజీ కోర్సులు, ఎంసిఎ, మేనేజిమెంట్ కోర్సులు, రూరల్ మేనేజిమెంట్ కోర్సులు, లా, బయో టెక్నాలజీ, ఎంబిబిఎస్, బిడిఎస్, నర్సింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, సినిమా, మీడియా స్టడీ, లాంగ్వేజ్ కోర్సులు ఇత్యాది ఎన్నింటినో నిర్వహిస్తున్నారు. స్వయంప్రతిపత్తి హోదాను సైతం కైవశం చేసుకున్న ఈ యూనివర్శిటీ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానాన్ని సంపాదించింది. కెజి నుంచి పీజీ వరకు కోర్సులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ప్రపంచస్థాయి గుర్తింపు కల్గిన 60కుపైగా యూనివర్శిటీలతో కెఐఐటి అనేక విద్యా ఒప్పందాలను కుదుర్చుకుంది. అంతర్జాతీయ యూనివర్శిటీల సంఘం, భారత యూనివర్శిటీల సంఘం, కామన్వెల్త్ యూనివర్శిటీల సంఘం, అంతర్జాతీయ యూనివర్శిటీ చాన్సెలర్ల సంఘం వంటి వాటిలో కెఐఐటి సభ్యత్వాన్ని కల్గి ఉంది. 20కుపైగా దేశాల నుంచి విద్యార్థులు ఈ యూనివర్శిటీలో రకరకాల కోర్సులు చేస్తున్నారు. 800కుపైగా ఫ్యాకల్టీ, 2500కుపైగా సైంటిస్టులు, పరిశోధకులు, మేనేజిమెంట్ సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు.

### గిరిజనులకు ఉచిత విద్య

అత్యున్నత ప్రమాణాల విద్యను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యమే విజయబాటలో నడిపిస్తోందని ఈ యూనివర్శిటీ సంస్థాపకుడైన డాక్టర్ అచ్యుత సమంతా బెంగుళూరులో సోమవారం ఆన్‌లైన్ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. గిరిజనులకు ఉచితంగా విద్యను అందించే దిశలో చక్కటి సామాజిక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. 15కుపైగా ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఈ యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చుకుని శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. జాతీయ స్థాయిలో యూనివర్శిటీల జాబితాలో 16వ స్థానాన్ని కైవశం చేసుకుంది. ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ విద్యా ప్రమాణాలకే కొత్త రూపమిచ్చామని ఇది తమకెంతో తృప్తినిస్తోందని సమంత వివరించారు. కర్ణాటక , ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలనుంచి కూడా వందలాది మంది విద్యార్థులు తమ సంస్థలో విద్యాభ్యాసం చేస్తున్నారని చెప్పారు. వివరాల కోసం కెఐఐటి వెబ్‌సైట్ www.kiit.ac.in, www.kiss.ac.in వెబ్‌సైట్‌లను సంప్రదించవచ్చు.

(ఆన్‌లైన్ ప్రతినిధి–బెంగుళూరు)




ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న డా.సమంత



ఉపరాష్ట్రపతితో డాక్టర్ సమంత



కర్ణాటక మంత్రి జగదీశ్‌శెట్టర్ యూనివర్శిటీని సందర్శించిన వేళ...

## అలరించిన సౌత్ ఇండియా జ్యువెలరీ షో



బెంగుళూరు, ఫిబ్రవరి 16 (ఆన్‌లైన్) : ప్యాలెస్ మైదానంలో సోమవారం ప్రారంభమైన 6వ దక్షిణ భారత నగల ప్రదర్శన ఎస్‌ఐజెఎస్–2012 అందరినీ అలరించింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ప్రధాని దేవెగౌడ ప్రారంభించారు. కార్యక్రమంలో విధానపరిషత్ ప్రతిపక్షనేత మోటమ్మ, కర్ణాటక జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.ఎ.శరవణ, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ డైరెక్టర్ కె.శివరాం, ఉమేశ్ వధేరా తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్ విజిలెన్స్ స్టడీ సర్కిల్ సమావేశం




బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆన్‌లైన్ ప్రతినిధి) : దేశ వ్యాప్తంగా విజిలెన్స్ స్టడీ సర్కిల్స్‌ను కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఏర్పాటు చేసిన తర్వాత ఇదే మొదటి సారి కెనరా బ్యాంక్‌లో స్టడీ సర్కిల్ సమావేశం జరిపింది. ఇందులో విజిలెన్స్ పరంగా చేపట్టాల్సిన వివిధ అంశాలపై సమాలోచనలు జరిపారు. ప్రత్యేకించి బ్యాకింగ్ సొసైటీలలో పెరుగుతున్న అవినీతి అక్రమాలపై సమావేశం చర్చించింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. విజిలెన్స్ కమిషనర్ ఆర్.శ్రీకుమార్, పద్మశ్రీ ఎస్.సుబ్రమణ్యాన్‌తో పాటు నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా వైస్ ఛాన్సులర్ ఆఫ్ ఇండియా ఆర్.వెంకట్రావ్, కుద్రే ముఖ్ ఇనుము ఉక్కు కంపెనీ సిఎండి కె.రంగనాథ్, కెనరా బ్యాంక్ సిఎండి ఎస్.రామన్, ఐటిఐ కంపెనీ సిఎండి కె.ఎల్.ధింగారా తదితరులు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

## కార్పొరేషన్ బ్యాంక్ నూతన ఈడీగా అమర్ లాల్



బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆన్‌లైన్ ప్రతినిధి) : కార్పొరేషన్ బ్యాంకు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అమర్‌లాల్ దౌల్తాని బాధ్యతలను స్వీకరించారు. ఈ బాధ్యతలను స్వీకరించేందుకు ముందు ఆయన చెన్నైలోని అలహాబాద్ బ్యాంకు దక్షిణ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్‌గా సేవలందించేవారు. ఆగ్రా యూనివర్శిటీ నుంచి అర్థశాస్త్రంలో పట్టా పుచ్చుకున్న అమర్‌లాల్ 1978లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా బ్యాంకింగ్ కెరీర్‌ను ప్రారంభించి అనేక కీలక పదవులను నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి సభ్యులందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.